# వాడినపూలు

ఆశకి చిహ్నం వెలుగు. నిరాశకి నిర్వచనం చీకటి - ఈ వెలుగు చీకట్ల మధ్య వెతుకులాడేది మానవజీవితం. సంక్రాంతి నా పుట్టినరోజు. ఒక్క పుట్టిన రోజుగానే కాకుండా ఇంకా అనేక రకాలయిన అనుభూతులు నిండి నామనసులో హత్తుకుపోయిన యీ పర్వదినానికి ఓ విధమైన ప్రత్యేకత వుంది. నా చిన్నప్పుడు స్కూల్లో చదువుకునే రోజుల్లో నేను, భాస్కరం కలిసి గంటల తరబడి కూర్చుని బంతిపూలు పెద్దపెద్ద మాలలుగా గ్రుచ్చి గుమ్మాలకి వ్రేలాడతీసేవాళ్ళం. తెల్లవారుజామున పళ్ళు కటకట లాడించే చలిలో లేచి దొడ్లో భోగిమంట వేసుకుని ఆ యెర్రటి మంటముందు యేవేవో కబుర్లు యెడతెరిపి లేకుండా చెప్పుకునే వాళ్ళం. పండుగనాడు పూళ్ళోజరిగే కోళ్ళపందెంలో పాల్గొనే భాస్కరం తప్పకుండా విజయదేవతని వరించి సగర్వంగా చిరునవ్వుతో "సుశీ! ఇదుగో" అంటూ పెద్ద చెరుగ్గడ తెచ్చి నాకు కానుకగా సమర్పించేవాడు. నేను మహారాణిలా ఠీవీగా అందుకునేదాన్ని. సంక్రాంతి పండగకి, భాస్కరాన్ని గురించిన జ్ఞాపకానికి నా మనసులో యీ అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది. భాస్కరం స్మృతి చక్కటి వెలుగయితే, దాని ప్రక్కనే మరో విషాదమైన జ్ఞాపకం చిక్కటి చీకటిలా లేకపోలేదు.

నాలుగు సంవత్సరాల క్రితం సరిగ్గా సంక్రాంతిపండుగ రేపనగా వారు హృద్రోగంతో నాచేతులమధ్య మరణించారు. ఆయన మృత్యువు నా జీవితాన్ని నిస్సారంగా, శూన్యంగా. ధ్యేయంలేకుండా చేసింది. నేనుడాక్టర్ని. ఇలాంటి భావాలన్నీ అర్థంలేని సెంటిమెంట్స్ అని నాకుతెలుసు. జీవితాన్ని యే కోణం నుంచి చూడాలో అనుభవం నాకు బాగానే పాఠం నేర్పింది. నా చేతులమీదుగా ఎంతమందినో మృత్యువునుంచి రక్షించాను. ప్రాణాల మీద ఆశ వదలుకుని, దీనమైన చూపులతో, మూగగా అనుభవిస్తున్న బాధతో నా దగ్గరికి వచ్చినవాళ్ళకి జీవితం ప్రసాదించి మనసుల్లో ఆనందం, ముఖాల్లో సరికొత్త వెలుగు నింపుకుని కృతజ్ఞతా భారంతో

నన్నొక దేవతగానే భావించి వెళ్ళేలా చేసేదాన్ని. కొద్దిమంది,చాలా కొద్ది మంది నా చేతుల్లో ప్రాణాలు వదిలారు. నా కత్తులు, కటార్లు, నా వైద్య శాస్త్రం యెందుకూ పనికిరావని వెక్కిరిస్తూ మృత్యుదేవత చిలిపిగానవ్వి విజయపూర్వకంగా వెళ్ళిపోయిన క్షణాలవి. ఓడిపోయిన నా మనసు పిచ్చెక్కినట్లు, వూపిరి ఆడనట్లు విలవిల్లాడేది. ఆ రోజంతా దిగులుతో అమావాస్య చీకట్ల కొట్టుమిట్టాడుతున్నట్టు తపించేదాన్ని. ఏం చేయ్యలేని అశక్తత నన్ను ఆలోచనలు అనే అఘాతంలోకి విసిరేస్తే అక్కడ శోధించి చివరకు వేదాంతం అనే తృప్తిని పొంది దానిద్వారా సేదతీరేదాన్ని.ముప్పై అయిదు సంవత్సరాలు అయినా పూర్తిగా నిండని నేను డాక్టరుగా ఆంధ్ర దేశంలో అత్యుత్తమమైన వారిలో ఒకరిగా పేరు ప్రతిష్ఠలు సంపాయించు కున్న మాట నిజమే. నా పేరు చెప్పగానే రోగుల కళ్ళలో మెరిసే ఆశ కూడా నాకు తెలుసు. కాని ఈ రోజు యిలా అనారోగ్యంతో,అలసటగా, తప్పనిసరిగా తీసుకోవాల్సివచ్చిన విశ్రాంతికోసం బలవంతంగా మంచం మీద పడుకుని ఆలోచిస్తూ ఒక్కసారి గతంలోకి వెనక్కి తిరిగి చూసుకుంటే జరిగిపోయిన నా జీవితంలో నా ఒక్కగానొక్క కూతురు మంజు తప్ప చెప్పుకోతగ్గదిగాని, అపురూపంగా కన్పించేది కాని యేమీ మిగలడం లేదు.

డాక్టరు కావాలని చిన్నప్పటినుంచీ కలలుకన్నాను. దానికోసం పట్టుదలగా ప్రయత్నించాను. కానీ ఆ ఫలితం సంపూర్తిగా పొందుతున్నానూ అనే తృప్తి నాకిప్పుడు ఎందుకు లేదు? ఈ ప్రశ్న ఈ మధ్య తరచుగానన్ను వేధిస్తోంది. వయస్సు అయిపోతోందీ అనే నగ్న సత్యాన్ని గుర్తించమని మనస్సు హెచ్చరించటంవలననా?లేక వ్యక్తిగా, పేరుప్రతిష్ఠలుగల డాక్టరుగా సంఘంలో ఓ ప్రత్యేకమైన స్థితిని హోదాని కల్పించుకున్న నేను స్త్రీగా పొందవలసినవాటికి దూరమైనానని జ్ఞాపకం చేసుకుని ఆవేదన పొందడంవల్లనా? ఎందువల్ల నాకీ బాధ? ఇంత చిన్న వయస్సులోనే వైధవ్యం పొందానంటే అది ఎవరితప్పు? రాజారావుగారికి, నాకు మధ్య 20 సంవత్సరాల తేడావుందని, నేను యవ్వన పాంగణంలో అడుగు పెట్టేసరికి ఆయన అక్కడ్నుంచి నిష్క్రమించారనీ తెలిసికూడా నేను కావాలనే ఆయన్ని చేసుకున్నాను. ఆయన మృత్యువు అకాలమరణం ఎవ్వ

టికీ కాదు. పండినపండు రాలిపోయింది. అంతే! ఆయన భర్తగాకంటే ఆప్తుడిగా, ప్రియమిత్రుడిగా నాలో యెక్కువ స్థానం ఏర్పరచుకున్నట్టు యిప్పుడుగాని నాకు తెలియడం లేదు.

ఒకవేళ నా కేదయినా అయితే ఆంధ్రదేశం ఒక్కనిమిషం-ఒకే ఒక్క నిమిషం — "అయ్యో! అనుభవంగల డాక్టరుని పోగొట్టుకున్నామే" అని విచారిస్తుంది. కాని ఆ విచారం ఎంతసేపు? క్షణంలో సగంసేపుకూడా వుండదు. మళ్ళీ వెంటనే నాలాటి మరో డాక్టర్ దగ్గరికి పరుగెత్తుతుంది. వాళ్ళద్వారా నా స్థానాన్ని వెంటనే భర్తీచేసుకుంటుంది. బహుశా కొద్ది రోజులు గడిచిపోతే నాపేరుగూడా యెవరికీ గుర్తుండదేమో? దీనికోసమేనా ఇంత కష్టపడింది? ఈ ఫలితం కోసమేనా స్వసుఖం లక్ష్యపెట్టకుండా అందరికీ సేవలు చేస్తూ అహోరాత్రులూ కృషి చేసింది? కానీ-కానీ యీ విధంగా చేయమని నన్ను యెవరూ శాసించలేదే? కనీసం అర్థించలేదే? ఇదంతా నేను కోరుకున్నదే తప్ప ఎవరి ప్రమేయమూ లేదే?తృప్తి యివ్వ లేని యీఫలితంకోసం కొన్ని సంవత్సరాలక్రితంఓ వ్యక్తి హృదయాన్ని నిర్లక్ష్యంగా కాలదన్నుకున్నానని గుర్తుకువస్తే మరీ బాధనిపిస్తోంది. ఆనాడు అతను కోరినట్టుగా భాస్కర్‌తోనే నా వివాహం అయివుంటే యీ సరికి ఎలా వుండేదాన్ని? భర్త, యిల్లు, పిల్లలు, వాళ్ళ బాధ్యతలు వీటన్నిటిమధ్య భర్తగా అతను చూపే అపురూపమైనఆరాధనను-యివన్నీ నేను పొందిఉండేదాన్నికదూ! ఈ మధ్య ఈ విషయం నేను చదివి చెప్పి నట్టు యింత తరచుగా ఎందుకు గుర్తుకువస్తోంది? అలా గుర్తుకు రాగానే ఆలోచనాలు పరివిధాల పోతున్నాయి.

"అమ్మా! తాళం చెవులు ఎక్కడ పెట్టావు? నాకు ఓ అయిదు రూపాయలు కావాలి." ప్రక్కగదిలోంచి విన్పించిన మంజు కేకతో వులిక్కిపడి యీ లోకంలోకి వచ్చాను.

"ఇవిగో, నా దగ్గరున్నాయి."

మంజు దగ్గరికి వచ్చింది.

"ఎక్కడికి వెడుతున్నావు?" అని అడిగాను. మంజు అలవాటుకి విరుద్ధంగా ఈ రోజు చాలా శ్రద్ధగా అలంకారమైంది.

"సినిమాకి."

— · —

తాళంచెవులు తీసుకు వెళ్ళిన మంజు మరో రెండు నిమిషాల్లో పక పక నవ్వుతూ తిరిగివచ్చింది.

"చూడమ్మా నీ మతిమరుపు! బీరువాలో యీ ఎండిపోయిన పూలేమిటి?" అంది.

"మంజూ!" వాటిని చూడగానే నా గుండె లయ తప్పింది.

"ఎప్పుడో డబ్బుకి బదులు పరధ్యాసగా వీటిని భద్రంగా దాచి వుంటావు!" మంజు ఇంకా నవ్వుతూనే వాటిని పారేయటానికి కిటికీవైపు నడిచింది.

"ఆగు. వాటిని పారేయకు. ఇలాతే." వెనకనుండి ఆదుర్దాగా పిలిచాను. కంఠస్వరం, ఆ మాటలు, నేను పలికినతీరు చూసి మంజు ఆగి వెనక్కు తిరిగి నా వైపు ఆశ్చర్యంగా చూసింది.

"నీకు తెలియదు నేను కావాలనే దాచివుంచాను. ఇలా ఇవ్వు" సూటిగా దాని ముఖంలోకి చూడలేక చేయిచాస్తూ అన్నాను.

మంజు ఏమనుకుందో ఏమో? ఓసారి తన చేతిలో పూలవైపు, మరోసారి నా వైపు మార్చి మార్చి చూసి, పువ్వులు తెచ్చినా కందించింది. వాటిని అందుకని వెంటనే దిండు క్రిందాదాచేశాను.

"ఎవరితో వెడుతున్నావు? త్వరగా యింటికి వచ్చేయి" అన్నాను. ఆ వాడిపోయిన పూలగురించి ఇంకా నేనేమైనా చెప్తానేమోనని కుతూహలంగా చూస్తూ నిలబడిన మంజు నా మాటలు వినగానే చట్కున ఏదో గుర్తుకు వచ్చినట్టు చేతివాచీ చూసుకుని గబా గబా వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతున్నమంజుని వెనకనుంచి కళ్ళార్తిచూసిన నేను తృప్తిగా నిట్టూర్చాను. మంజు నా అందమే గాకుండా తండ్రిలోని విశిష్టమయిన వ్యక్తిత్వంకూడా వారసత్వంగా పుణికి పుచ్చుకుంది. స్త్రీగా నేను పొందలేక, పోయిన వాటినన్నిటినీ నా మంజు పొంది తీరాలి. సాధ్యమయినంత త్వరలో యోగ్యుడై అన్ని విధాలా దాన్ని అపురూపంగా చూసుకునే వ్యక్తిని చూసి పెళ్ళి చేసెయ్యాలి. నా చరమజీవితం అంతా సుఖ సంతోషాలతో వెల్లివిరుస్తూ,భర్త—పిల్లల మధ్య ఆనందంగా తిరుగుతున్న మంజుని చూస్తూ తృప్తిగా నిశ్చింతగా వెళ్ళిపోవాలి. అప్పుడు నాకింత బాధ వుండదు.

మనిషికి జీవితం అంటేనే యవ్వనం. బాల్యంనుంచి దానికోసం ఎదురు చూస్తూ వృద్ధాప్యంలో ఆ స్మృతిని నెమరువేసుకుంటూ, గడప గలిగి నాడే తృప్తిగా మృత్యు ముఖంలోకి అడుగుపెట్టే సాహసం వస్తుంది. వయసు గడచిన తర్వాత వెనక్కు తిరిగి చూసుకుంటే మధురమైన అనుభూతులు మిగలని మనిషికి జీవితపు చివరిదశలో అర్థం గాని అవేదన, బ్రతుకు వ్యర్థమైందేమోననే ఆరాటం, తపన పుట్టించి ఇంకా కొన్ని సంవత్సరాలు బ్రతకాలని, జీవితం ఇంకా ఇంకా కావాలనీ వేధించేలాచేస్తాయేమో అనిపిస్తుంది!

నా చేతులు మెల్లగా దిండుకింద వున్న పువ్వులని మళ్ళీ తీసుకున్నాయి. వాటిని అలా రెప్పవాల్చకుండా చూస్తోంటే మనసు పరిపరి విధాల పోసాగింది. భాస్కరం ఇప్పుడెక్కడున్నాడు? ఏంచేస్తున్నాడు! ఎక్కడున్నా సలక్షణంగా హాయిగా వుండివుంటాడు. అందులో సందేహంలేదు. భాస్కరంలాంటి మనుష్యులకి జీవితంతో ఎలా రాజీపడాలో తెలుసు అవసరంఅయితే దాన్ని కొమ్ములుపట్టి చెవులు మెలసి రొంగదీసుకుని బలవంతంగా పమదారికి తెచ్చుకోగల సమర్థతకూడా వుంది. తొలి యవ్వనంలో విఫలమయిన ఒక ప్రేమ సంఘటనతో నిరాశ పొంది జీవితాన్నే శూన్యం చేసుకునే వ్యక్తులలోనికి అతనురాడు. ఆ సంగతి నాకు తెలుసు.

డాక్టరు కావాలనే ఈ వెర్రి కోరికే నాకు లేకపోతే ఈసరికి నేనూ భాస్కరం భార్యాభర్తలుగా వుండేవాళ్ళమా! ఏమో! అయినా నాజీవితం ఇలా యిన్ని మలుపు తిరగాలనివుంటే నేనెలా ఒప్పుకుంటాను? ఇక్కడే ఇష్టలేకపోయినా ప్రతిమనిషీ సిద్ధాంతాన్ని ఒప్పుకు తీరాల్సి వస్తుందేమో!

నేను పల్లెటూరులో అతి సామాన్యమైన కుటుంబంలో పుట్టాను. ఊళ్ళోవున్న స్కూల్ పుణ్యమా అని స్కూల్ ఫైనల్ వరకూ చదువుకునే యోగ్యత కలిగింది. ఆ చదువుకునే కాలంలోనే డాక్టర్ కావాలనే నాకాంక్షకి వసుంధర పరిచయంతో నాలో వితనాలు నాటింది. వసుంధర నా క్లాస్‌మేట్. రాజ్యానికి పెత్తల్లికూతురు. ప్రతివేసవిలో మా రాజ్యం వాళ్ళింటికి వస్తూ ఉండేది. అప్పటికే మద్రాసులో డాక్టరు చదు

వుతున్న వసుంధర తన కాలేజీ కబుర్లేకాక, స్త్రీలు పొందవలసిన వ్యక్తిత్వాన్ని గురించి, ఆర్థిక స్వాతంత్ర్యంగురించి ఆపకుండా ఎన్నెన్నో మాట్లాడేది ఆర్థికంగా తనకాళ్ళమీద తను నిలబడగలిగిన స్త్రీ, తన ఆలోచనలు తను నిర్ణయించుకోగలిగిన స్త్రీ. మగవాడికి ఏ మాత్రం భయపడనవసరంలేదు అనేది.

కారణం ఏమిటో నాకు తెలియదు. కాని వసుందర మాట్లాడే ప్రతి నాలుగుమాటలకి ఒక మాట మనదేశం మగవాళ్ళ మీద విసుగు, అసహ్యం ప్రదర్శిస్తూ ఉండేది. వాళ్ళని విమర్శించడంలోగాని, దుయ్యబట్టడంలోగాని, అలా మాట్లాడేటప్పుడు తన నోటినుంచి వెలువడే భాషలో గాని ఏ మాత్రం జంకుగొంకులు కనిపించేవికాదు. వేసవి శలవులు ఎప్పుడు వస్తాయా, వసుంధర మావూరు యెప్పుడు వస్తుందా అని రాజ్యం, నేనూ వేయికళ్ళతో ఎదురు చూసే వాళ్ళం వసుంధర వచ్చి ఉన్నన్ని రోజులూ నీడలా వెంట తిరిగేవాళ్ళం. తను చెప్పేకబుర్లు ఒక అక్షరం పొల్లుపోకుండా కళ్ళు అప్పగించుకుని, చెవులు దొరపెట్టుకుని అత్యంత శ్రద్ధగా వినేవాళ్ళం. రాను రాను నాక్కూడా వసుంధర ఉపదేశించినట్టు అన్నివిధాలా వ్యక్తిత్వంగల స్త్రీగా రూపొందాలనే కాంక్ష బలంగా ఏర్పడసాగింది. అలాటి ప్రత్యేకత కావాలంటే ముందు డాక్టరు కావాలి అనె ఏ వెర్రినమ్మకం కూడా కలిగింది. ఆ విధంగా వసుంధర పరిచయంతో నాటుకున్న ఈ విత్తనంస్కూల్ ఫైనల్ చదువు పూర్తయ్యేసరికి మహా వృక్షంగా మారి నా మనసంతా ఆక్రమించుకుంది. దాన్ని పెకిలించటానికిగాని, పడగొట్టడానికిగాని నాకు శక్తి చాలదు.

కాని మా కుటుంబపరిస్థితులు, ఆచార వ్యవహారాలు తెలసిననేను మొండి పట్టుదల పట్టలేకపోయాను. ఆశయం ముందుకు తోస్తుంటే వివేకం వెనక్కులాగడం ప్రారంభించింది, ఈ రెండిటిమధ్యా నిస్సహాయంగా నలిగి పోసాగాను.

మా వాళ్ళు ఆ వేసవిలో నాకుతప్పకుండా వివాహం చేసెయ్యాలని ఆత్రపడుతున్నారు. క్షణం విరామంలేకుండా సంబధాలు గాలిస్తున్నారు. నాన్నగారు నాకు వరుడికోసం పూళ్ళు గాలిస్తుంటే, నేను నా గదిలో

నులకమంచం మీద పడుకుని గాలిమేడలా అంతరించిపోతున్న నా కోర్కెని, ఎండమావిలా వెక్కిరించబోతున్న భవిష్యత్తును చూసి నిశ్శబ్దంగా కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వుండేదాన్ని. నాకే ప్రత్యేకతా లేదు. మామూలుగా పెళ్ళిచేసుకున్నాను అని మామూలుగా అత్తవారింటికి వెళ్లాను. అందరి ఆడవాళ్ళలాగనే నేనూ పిల్లల్ని కంటాను. వయసు అయిపోతుంది. శరీరం ముడతలు పడుతుంది. నే నెందుకు బ్రతుకుతున్నానో నాకే తెలియని నిరాశతో రోజులువెళ్ళదీసుకుంటూ, కళ్ళముందు స్పష్టంగా కన్పిస్తున్న భయంకరమైన ఈ భవిష్యత్ చూచి మనసు భయంతో ముడుచుకుపోయింది. కాదు, కాదు. అలా కావటానికి వీల్లేదు. నేను డాక్టర్ని అయితీరాలి. వసుంధరలా వ్యక్తిత్వంగల స్త్రీగా సంఘంలో అందిరిచేత గుర్తింపబడాలి. ఆ ప్రత్యేకత లేకపోతే నేను భరించలేను. కాని ఎలా? ఏవిధంగా? కటికచీకటిలాంటి ఈ నిరాశలో దారి తెలియనట్టు కొట్టుమిట్టాడుతున్న నాకు రాజారావుగారి పరిచయం ఒక చిన్న వెలుగుకిరణంగా భాసించింది చీకటిలో. శూన్యంలో కొట్టుకుంటున్న నేను హఠాత్తుగా ఆగిపోయి నా దృష్టినంతా దానివైపు కేంద్రీకరించి ఆశగా, ఆత్రంగా చూశాను.

యవ్వనంతోపాటు వికసిస్తున్న నా అందం ధనికుడు, సహృదయుడు అయిన రాజారావుగారి మనసుని ఆకర్షించింది. భార్యపోయిన 16 సంవత్సరాలకి నన్ను చూసిన తర్వాత ఆయనకి మళ్ళీ భార్యగా ఓ స్త్రీని పొందాలనీ ఇల్లు కళకళలాడించుకోవాలనీ కుతూహలం కలిగింది. ఆ కుతూహలం ఆయనలో రేకెత్తటానికి సగం నా ప్రవర్తనే కారణం అని చెప్పటానికి నేను సిగ్గుపడను. కాని మా ఇద్దరిమధ్యా వున్న వయసు, తారతమ్యంచూసి సూటిగా మా నాన్నని అడగటానికి భయపడ్డారు. ఒక దూరపు బంధువు ద్వారా ఆయన అభిప్రాయం గ్రహించినా, నాన్న అసలు ఆ విషయమే పట్టించుకోలేదు.

మా పిన్ని కూతురు లక్ష్మి పెళ్ళికి మేము బెజవాడ వెళ్ళినప్పుడు ఆయన అక్కడకు వచ్చారు. ఆ హడావుడిలో అదను చూచుకొని అవకాశం కల్పించుకొని ఆయన ఏకాంతంగా వున్నప్పుడు ఆయనకి కాఫీ

ఇచ్చే నెపంతో దగ్గరికి వెళ్ళి, నన్ను డాక్టర్ చదివిస్తే నాకేమీ అభ్యంతరం లేదని, ఆనందంగా ఈ పెళ్ళికి ఒప్పుకుంటాననీ చెప్పాను. మొదట ఆయన నేను చెబుతున్న దేమిటో అర్థంకాని మనిషిలా తెల్లబోయి చూశారు. ప్రక్కనున్న కుర్చీ చూపించి నన్ను కూర్చోమని ఆదేశించి, అసలు విషయం చెప్పమని అడిగారు. డాక్టర్ చదవాలన్న నా అభిలాషని బయట పెట్టాను. అలా చెప్తున్నప్పుడు నా ముఖంలో ఏం కన్పించిందో తెలియదు- నా చెయ్యి తీసుకుని మెల్లిగా నొక్కుతూ ఆదరంగా "నా కర్థమైంది, నీకు కావాల్సింది డాక్టర్ చదవటానికి అవకాశం. నాకు కావల్సింది నీలాంటి అందమైన భార్య- సరే! మీ నాన్నని మన వివాహానికి ఒప్పుకునేలా చేస్తాను" అన్నారు.

నేను కళ్ళతోనే నా కృతజ్ఞతలు, ఆనందాన్ని మౌనంగా తెలిపి లేచి వచ్చేశాను.

"ఇదుగో!" వెనుకనుంచి పిలవడంతో గుమ్మం దాటబోతున్న నేను ఆగిపోయాను.

"నువ్వు నాకు ఒకటి వాగ్దానం చెయ్యాలి."

ఏమిటన్నట్టు చూశాను.

"ముందు ముందు జీవితంలో ఎప్పుడూ నువ్వీ విషయంలో పొరబడినట్టుగాని, త్వరపడ్డట్టుగాని అనుకోకూడదు. ఆ నమ్మకం నీకుందా? గట్టిగా ఆలోచించుకో" అన్నారు గంభీరంగా.

తర్వాత 15 రోజులకి మా వివాహానికి తాంబూలాలు పుచ్చుకోనడం జరిగింది. మా ఇద్దరిమధ్యా కొట్టొచ్చినట్టు కన్పిస్తున్న వయసు తేడా చూసి మా బంధువులంతా చెవులు కొరుక్కున్నారు. ముసలాయనకి కూతురుని ఎరగా పెట్టి ఆస్తి స్వంతం చేసుకోవాలని మా నాన్న ఎత్తు వేశాడని ఆడిపోసుకున్నారు.

ఆయన్ని ఏకాంతంగా కలుసుకుని నా అంత నేనే ఈ పెళ్ళికి ఒప్పుకున్నట్టు చూచాయగా తెలుసుకుని నాది సిగ్గులేనితనం జాణతనం అంటూ అనేక పుకార్లు పుట్టించారు. ఒకళ్ళిద్దరు అమ్మలక్కలు స్వయంగా నా దగ్గరికి వచ్చి బుగ్గలు సాగలాగి మరీ అసలు విషయం చెప్పమని వేధించారు. కాని నాకు ఇవేమీ పట్టనేలేదు. ఆయన అన్నట్టు నాకు కావా

ల్సింది చదువుకునేందుకు అవకాశం. ఆయనకి కావల్సింది అంద మయిన భార్య. ఆ పైన నేను ఆలోచించదలుచు కోలేదు. కాని సాధ్య మయినంత త్వరలో ఈ పెళ్ళి అయిపోతే బాగుండుననిపించింది. లేక పోతే కాకి మూకలాటి ఈ బంధువులు నా మీద లేనిపోనివి చెప్పి ఆయన మనసు ఎక్కడ విరిచేస్తారో అని భయంగా వుండేది. కాని అలాంటిదేం జరగలేదు.

తాంబూలాలు పుచ్చుకున్నారు- అని తెలియగానే బందరునుంచి భాస్కరం వూడిపడ్డాడు. భాస్కరం కుటుంబానికి, మా కుటుంబానికి బంధుత్వం కంటే స్నేహమే ఎక్కువ. భాస్కరం తండ్రిపోయి అయిదారు సంవత్సరాలు అయింది. అప్పటినుంచీ మా నాన్నగారే వాళ్ళ కుటుంబానికి అడపా దడపా సాయం చేస్తున్నారు. భాస్కరం తల్లి నన్ను స్వంత కూతురులాగానే చూసేది. మా నాన్న, ఆవిడ అన్నా చెల్లెళ్ళ వరుసలో పిలుచుకునే వాళ్ళు. నెలకి 20 రోజులు ఏదో సుస్తీతో మా అమ్మ మంచం మీదవుంటే ఆవిడే మా యింటి పనులుకూడా చూసేది. నా కంటే భాస్కరం నాలుగయిదు సంవత్సరాలు పెద్దయినా భాస్కరం నా పెళ్ళినాటికి బందరులో బి.ఏ. రెండో సంవత్సరం చదువు తున్నాడు.

రాజారావుగారిని భర్తగా స్వీకరించే విషయంలో భాస్కరం అను మతి అడగాలనికాని, అతన్ని సంప్రదించి సలహా పొందాలనికాని నేను కల్లోకూడా అనుకోలేదు. అసలు ఆ ఊహే నాకు రాలేదు. ఆ రోజు రాత్రి వూరునుంచి వచ్చీరాగానే మా ఇంటికివచ్చి నన్ను అనేక పేర్లతో పిలుస్తూ, నాకింత ద్రోహ బుద్ధి వుందని తను గుర్తించలేదని, నేను అతన్ని తీవ్రంగా గాయ పరిచాననీ ఏవిటేవిటో అంటూంటే మొట్ట మొదటిసారిగా వింటున్న నేను తెల్లబోయి చూడసాగాను.

ఆ రోజు ఆ రాత్రి నా కిప్పటికీ బాగా గుర్తుంది. అమ్మ రెండు రోజులనుండీ సుస్తీతో ఈరోజు కాస్త విశ్రాంతిగా నిద్రపోతోంది. నాన్న ఇంట్లోలేరు. పనిమీద మునసబుగారింటికి వెళ్ళారు. పగలంతా ఆ పని, ఈ పని చేసి అలిసిపోయి కూడా నా కెందుకో నిద్ర రావటం లేదు. అందుకే అప్పుడెప్పుడో వసుంధర ఇచ్చిన పాత ఇంగ్లీష్ నవల ఒకటి తీసు

కుని చదువుతూ పడుకున్నాను. అందులో చాలా ఇంగ్లీషు మాటలు నాకర్థం గాకపోవటంతో అది కూడా విసుగ్గానే వుంది. బలవంతంగా కళ్ళు మూసుకుని నిద్రకోసం ప్రయత్నం చేయాలి అనుకున్న నేను లాంతరు వత్తి తగ్గించబోతుండగా గుమ్మంలో అలికిడి విన్పించటంతో తలెత్తి చూశాను.

భాస్కరం లోపల అడుగు పెడుతూనే వెనక గది తలుపులు మూశాడు. లాంతరు వత్తి తగ్గించబోతున్న నేను ఎక్కించి సరిచేశాను. గుమ్మంలో నిటారుగా నిలబడివున్న అతని ఆకారమే నాకు కొత్తగా కన్పించింది! జుట్టు చెదిరి ముఖంమీద చిందర వందరగా పడుతోంది. ముఖంలో కోపం తొంగి చూస్తున్నట్టు కఠినంగా వుంది. పళ్ళుబిగబట్టినట్టు దవడల దగ్గర ఎముకలు కన్పిస్తున్నాయి. గుప్పెట్లు బిగించి బరువుగా వూపిరి పీలుస్తున్నట్టు చూస్తున్న అతన్ని చూడగానే నామీద పెద్ద పోట్లాటకి సిద్ధం అయివచ్చాడని గ్రహించాను.

"సుశీ!"

నేనింకా అయోమయంగా అలాగే చూస్తున్నాను. అతన్ని అలా నేనింతవరకూ ఎప్పుడూ చూడలేదు.

"రాజారావుగారితో నీ పెళ్ళి స్థిరపడిన మాట నిజమేనా?"

"నిజమే!"

"ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు!"

"నాన్నగారు మాట ఇచ్చేశారు." ఉలిక్కిపడుతూ అన్నాను.

"మాట ఇచ్చింది ఎవరో నాకు తెలుసు."

నేను మాట్లాడలేదు.

"నీకే చెప్పేది, ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు."

"వీల్లేదంటానికి నువ్వెవరివి?" అన్న వెంటనే భయపడ్డాను. అతని కళ్ళలో క్రూర మృగం పురికినట్టు ఉప్పొంగిన భావం చూసి మరుక్షణంలో నా మీదపడి కొట్టబోతున్నాడనే అనుకున్నాను కాని అతనెలాగో నిగ్రహించుకున్నాడు. క్షణంసేపు ఆగి "అయితే ఈ పెళ్ళి జరిగి తీరుతుంది కదూ?" అన్నాడు. అతని ధోరణి ఏమిటో నాకు బొత్తిగా అర్థం కాలేదు. అయినా అలాటిస్థితిలో వున్న మనిషిని రెచ్చగొట్టడం మంచిది కాదని

పించింది. అందుకే అనునయంగా "ఆయన డాక్టర్ చదివిస్తానన్నారు" అన్నాను.

అతని ముఖం కాస్త ప్రసన్నం అయింది. నావైపు వస్తూ "డాక్టరు చదవటానికి, లాయరు చదవటానికి నువ్వేమైనా మగపిల్లాడివా?" అన్నాడు.

నాకు నిజంగానే ఒళ్ళు మండిపోయింది. "డాక్టరు మగపిల్లలే చదవాలని ఎక్కడైనా వుందా? ఆడపిల్లలకి కూడా ఆశయాలుంటాయి, మీ మగవాళ్ళు సాగనివ్వరుగాని" అన్నాను నిర్లక్ష్యంగా.

"ఇదంతా ఆ వసుంధర నీ తలలో ఎక్కించిన పైత్యం."

"నువ్వెలాగైనా అనుకో, నాకు అభ్యంతరంలేదు. డాక్టర్ చదవాలనే కోర్కె నేను కాదనుకోలేను. అది చెప్పించగల భర్త కావాలి నాకు. అది రాజారావుగారే కాదు, ఎవరైనా సరే. ఆ కోర్కెను నువ్వే తీర్చగలిగితే నిన్నే చేసుకుంటాను." నిశ్చలంగా అన్నాను.

భాస్కరం ఆగిపోయాడు. అతనేం మాట్లాడలేదు. కాని నావైపు చూస్తున్న ఆ కళ్ళలో గెలుస్తానని నమ్మకంగా ఎదురు చూస్తున్న మనిషి హటాత్తుగా అపజయం పొందినట్టు వాడిపోయి పాలిపోయింది. ఇప్పుడా ముఖంలో ప్రసన్నత అనేది నామమాత్రం కూడా లేదు. అయినా నాకు భయం వేయలేదు. కారణం అప్పట్లో అతని బలహీనత నాకు తెలుసు. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఏ మగవాడు తను అసమర్థుడిని అని స్వయంగా తనంతట తాను ఒప్పుకోడని నాకు తెలుసు.

అతను ఏమనుకున్నాడో ఏమో చివ్వున వెనక్కు తిరిగి పోబోయాడు. గుమ్మంవరకూ వెళ్ళి తలుపులు తెరువబోతున్నవాడల్లా అంతలోనే ఆగి వెనక్కు తిరిగి చూశాడు. ఇప్పుడా చూపుల్లో ఇంతక్రితం కన్పించిన కోపంగాని, అధికారంగాని లేవు. జాలిగా, దీనంగా అర్థిస్తున్నట్టు వున్నాయి. మళ్ళీ వెనక్కు తిరిగి నావైపు వస్తున్న అతనివైపు ప్రశ్నార్థకంగా చూశాను.

మంచం దగ్గరగా వచ్చి నిలబడిన అతను "సుశీ! డబ్బుతో నా విలువని గుర్తించకు. నువ్వంటే నాకెంత ప్రాణమో నీకు తెలియదూ? నువ్విప్పుడు డాక్టర్ కాకపోతే మాత్రం ఏమవుతుంది? నేను లేనూ నీకు? మనిద్దరం కలసివుంటే సుఖమైన సంసారం చాలదూ నీకు? డాక్టర్ చదవాలనే వెర్రి కోర్కెతో నువ్విప్పుడు గుర్తించడం లేదు. వయసు మళ్ళిన రాజారావుగారిని చేసుకున్నందుకు తర్వాత తర్వాత నువ్వు చాలా బాధపడతావు. నా మాట విను" అంటూ నా రెండు చేతులూ పట్టుకున్నాడు. నేను మాట్లాడలేదు.

"పోనీ, నువ్వు పోగొట్టుకున్నా, పోగొట్టుకోకపోయినా ఈ వివాహం వల్ల నీ జీవితం చాలా శూన్యమవుతుంది. నన్ను అర్థం చేసుకో. చిన్నప్పట్నించీ మనిద్దరం కలిసి మెలిసి తిరిగాం. నువ్వింకొకరి భార్యవి అయి వెళ్ళిపోతావు అన్న వూహ నాకెప్పుడూ రాలేదు సుశీ! నన్నర్థం చేసుకో" అంటూ నా చేతుల్లో ముఖం దాచుకుని "నీకంత డాక్టరు కోర్సు మీద మోజుంటే సుశీ- నేను....నేను....ఎంత కష్టం అయినాసరే మన పిల్లలకి చెప్పిస్తాను" అన్నాడు.

బాగుంది! ఇంకా నాకు చెప్పిస్తాననటున్నాడేమో అని అనుకుంటూ ఆశగా చూస్తున్న నేను వెంటనే చేతులు లాగేసుకున్నాను.

"ఏమంటావు?" అన్నాడు.

"నేను కలలు కంటున్నది, కోరుకుంటున్నది-డాక్టర్ కావాలని కాని, పిల్లలు తల్లిని కావాలని కాదు" అన్నాను.

నావైపు రెప్పవాల్చకుండా చూసిన అతను "నిదానంగా ఆలోచించి చూడు" అన్నాడు. ఆ మాట అనేటప్పుడు అతని కంఠం వణకడం నేను గమనించకపోలేదు. "బాగా ఆలోచించుకున్నాను" అన్నాను విసుగ్గా.

కొద్దిసేపు అలాగే నిలబడిపోయిన అతను నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు.

తర్వాత అతను నాకు ఒంటరిగా కలవలేదు. పెళ్ళిరోజు దగ్గర పడుతోంది, ఇల్లంతా హడావిడిగా వుంది. భాస్కరం మా ఇంటికి ఏదో పనిమీద వచ్చి వెడ్తూనే వున్నాడు. అతను నన్ను పలకరించలేదు. నా అంతట నేనెందుకు పలకరించాలి అని నేను కూడా వూరుకున్నాను. పెళ్ళి

నాలుగైదు రోజులుందనగా నాన్న భాస్కరం చేతికి డబ్బు యిచ్చి బందరు వెళ్ళి కొన్ని ముఖ్యమైన సరకులు తెమ్మని పంపారు. వెళ్ళిన భాస్కరం తిరిగి రాలేదు. ఏమయిపోయాడో పత్తాలేడు. ఉన్నట్టుండి అతనిలా హఠాత్తుగా మాయమవడం గురించి నలుగురూ నానారకలుగా అనుకున్నారు. మా యింట్లో పెళ్ళిపనులుచేస్తూ ఓ చెంప కొడుకు క్షేమం తెలియక కన్నీళ్ళు ఒత్తుకుంటున్న భాస్కరం తల్లిని వూరడించే బాధ్యత నా మీదనే పడింది కారణం ఆవిడ అమాయకంగా పదే పదే నాదగ్గరకు వచ్చి "నీకేమయినా చెప్పాడా? ఏమయినా ఉత్తరం వ్రాశాడా" అని అడుతుండేది. నాకు తెలియకుండా భాస్కరం యేమీ చెయ్యడని నమ్మకం కాబోలు.

పెళ్ళి యెల్లుండి అనగా నన్ను పెళ్ళికూతురిని చేశారు. బుగ్గన చుక్కతో, నుదుట కళ్యాణ తిలకంతో, పూలజడతో, పట్టుచీరతోవున్న నా రూపం యెలావుందో చూసుకోవాలనే కోరిక నాలో ఏర్పరచిన కుతూహలంతో నేను తలుపులు దగ్గరగా వేసుకున్నాను. నా గదిలో గోడకి తగిలించివున్న పాతకాలపు పొడుగాటి అద్దంముందు నిలబడి చూచుకున్నాను. మరో అద్దం పెట్టి వెనకవైపునించి కూడా ఎలా వుంటానో చూడాలనుకున్న నేను చిన్న అద్దం కోసం బొట్టుపెట్టె తెరిచాను. అందులో చిన్న కవరు ప్లాస్టిక్ కాగితంలో కన్పించింది. ఏమిటి? ఇక్కడెవరు పెట్టారు? అనుకుంటూ తీస్తుండగానే నాకు అర్థమయిపోయింది. అది భాస్కరం చేసిన పని. కవరు తీసిచూశాను. అందులో ఉత్తరం వుంది. క్షణంసేపు అది చదవకుండానే చించి అవతల పారవేద్దామనుకున్నాను. కాని చదవకుండా వుండలేక పోయాను. అందులో యిలా వుంది :

"సుశీ!

నువ్వింతకాలం దేవతవని నమ్మాను. కాదు; రాక్షసివి. పైకి అమాయకంగా కన్పించే నీలాంటి ఆడవాళ్ళు డబ్బుకోసం ఏమయినా చేస్తారు. నీకింత చిన్న వయసులో అంత ధనదాహం వుండడం మంచిది కాదు. నీ అవసరంకోసం నువ్వు రాజారావుగారిని వివాహం చేసుకుంటున్నావు! నీలాటి స్వార్థపరురాలిని భార్యగా పొందిన తర్వాత ఆయన

ఇకనుంచీ గడపబోయే జీవితంలో యెంత మనశ్శాంతి వుంటుందో ఆ భగవంతుడికే తెలియాలి. ఒక విధంగా ఆలోచిస్తే ఆయనకు ఆ శాస్తి కావాల్సిందే! నువ్వు దేనికోసం నన్నిలా నిర్లక్ష్యంగా కాలదన్ని పోతున్నావో అది నీకు జన్మ జన్మాలకి లభించకూడదని దేవుడిని ప్రార్థిస్తున్నాను. నువ్వెంత క్రూరురాలివి కాకపోతే అనుదినం మీ ఇంటికి వస్తున్న నన్ను మాటమాత్రం కూడా పలకరించవు! నీ నుంచి రాబోయే చల్లటి చూపుకోసం, ఒక చిన్న చిరునవ్వుకోసం నేనెంత ఎదురుచూశానో నీకెలా తెలుస్తుంది? ధనవంతురాలివి కాబోతున్నావనే గర్వం, అహంకారం అప్పుడే నీ కళ్ళకి పొరలు తెప్పించిందా? సరే. నేను వెడుతున్నాను. తిరిగిరానని నీకు తెలుసు. వెళ్లేముందు నీ వస్తువు ఒకటి నా దగ్గరుంది. బహుశా నువ్విప్పుడు గుర్తుచేసుకోటానికి ఇష్టపడవేమో? ఆరోజు....కార్తీక పౌర్ణమినాడు నువ్వు గుడినుంచి తిరిగివస్తుంటే తోడుగా ఇంటికి దిగబెట్టటానికి వచ్చినప్పుడు నీ తల్లో ఈ పూలమాలని తీసుకొన్నాను. ఆ తీసుకొనేటప్పుడు అవి వట్టిపూలు కావని, అంత నాజూకైన హృదయం అనీ అనుకున్నాను. అందుకే అంతభద్రంగా దాచుకొన్నాను. నీకిది అర్థంలేని వెర్రితనంగా కన్పించవచ్చు. నా పిచ్చిచూసి నువ్విప్పుడు నిరభ్యంతరంగా నవ్వుకున్నా బాధలేదు. ఈ వూరినుంచి నేను శాశ్వతంగా వెళ్ళిపోయే ముందు నీ చిహ్నమైన ఈ స్మృతిని విసిరి ఏచెత్తకుప్పలోనో పారెయ్యాలని అనేకసార్లు ప్రయత్నించాను. కాని సాధ్యం కాలేదు. అందుకే నీకు తిరిగి ఇస్తున్నాను. ఆ పని నువ్వే చెయ్యి. మనుష్యులనీ, వాళ్ళ పరిచయాలనీ వాడినపూలలా విసిరి గొట్టగలిగిన ధైర్యం, సాహసం నీలాంటి వాళ్ళకే వుంటాయి.

వుంటాను,
భాస్కరం."

ఆ ఉత్తరం నాకు చాలా కోపం తెప్పించిన మాట నిజమే కానీ యెందుకో ఆలోచిస్తే ఇప్పటికీ అర్థంకాదు. ఆ పూలని పారెయ్యలేకపోయాను. నాకు తెలియని విచిత్రమయిన శక్తిఏదో జాగ్రత్తగా దాచుకొనేలా నన్ను పురికొల్పింది. రాత్రి గాలిదుమారంలా దూసుకువచ్చిన అతని రూపం, వెళ్లేముందు దీనంగా వున్న అతని మాటలు, ఆ ఉత్తరం

నా మనసులో చెరగనిముద్రగా హత్తుకుని శాశ్వతంగా నిలిచిపోయినాయి.

భాస్కరం పెట్టిన శాపానికి ఫలితమేమో అని భయపడేట్టు నేను అత్తవారింటికి వెళ్ళిన మొదటి మాసంలోనే నాకు నెల తప్పింది. నిస్పృహతో కృంగిపోయిన నన్ను రాజారావుగారు దగ్గరకు తీసుకొని ఓదార్చారు. పుట్టబోయే సంతానం నా చదువుకి ఎలాంటి ఆటంకం తీసుకురాదని హామీ ఇచ్చారు. కాకపోతే ఒక్క సంవత్సరం ఆలస్యం అవుతుందనీ, ఓపిక పట్టమనీ అనునయంగా కోరారు. "నువ్విలా దిగులుపడిపోయి, వాడిన ముఖంతో కూర్చుంటే తండ్రిని కాబోతున్నాననే ఆనందం నేను పూర్తిగా అనుభవించలేను" అన్నారు. ఆయన కోసం సంతోషం తెచ్చిపెట్టుకొని రోజులు గతపడం మొదలు పెట్టాను. ఆయన ఎన్ని విధాల నచ్చజెప్పినా, ఎంత లాలించినా నా మనసులో ఓ మూల భయం పీకుతూనే ఉండేది. ఇప్పుడిలాగే చెప్పి తర్వాత ఆయన మనస్సు మార్చుకుంటే? అదీకాకుండా అసలు మనలో పెళ్ళి అయింతర్వాత చదువుకోవటం అంటేనే అపురూపం, అందులో పిల్లలు పుట్టిన తర్వాత అయితే వేరే చెప్పాలా? సాటివాళ్ళు అల్లే కథలకి, విరిచే మూతి విరుపులకు అంతుంటుందా? ఆయన కాదంటే నేనుమాత్రం చేసేది ఏముంది? ఇలా అనుక్షణం అనుమానంతో వేగిపోతున్న నేను మొట్టమొదటిసారి తల్లిని కాబోతున్నాను అనే ఆనందం ఎలా వుంటుందో గ్రహించనేలేదు.

మంజు పుట్టినతర్వాత ఆయనంతట ఆయనే అప్లికేషన్ తెప్పించి పూర్తిచేయమని ఇచ్చారు. నేను సంభ్రమాశ్చర్యాలతో అలాగే చూస్తుండిపోయాను. ఆ క్షణంలో నా ముఖంలో కన్పించిన భావానికి వారు బహుశా ముగ్ధులై వుండాలి. నన్ను దగ్గరికి తీసుకుంటూ "ఇప్పటికైనా నన్ను అర్థం చేసుకున్నావా? పిచ్చిదానా? కాదంటానేమోననే కదూ నీకు భయం? ఆడినమాట తప్పితే పోగొట్టుకునేది నీకంటె నేనే ఎక్కువని గ్రహించలేని మూర్ఖుడిని అనుకున్నావా?" అన్నారు.

"మీరేం పోగొట్టుకుంటారు?" అమాయకంగా అడిగాను.

"తెలియదూ? నీ కళ్ళలో అనురాగాన్ని, నీ మనసులో నమ్మకాన్ని. ఆ రెండేగా నా ఈ చరమ జీవితంలో ఉచ్ఛ్వాస నిశ్వాసాలు."

నేను నిశ్శబ్దంగా ఆయన చేతుల్లో ఒదిగిపోయాను. నాకాక్షణంలో

మన దేశంలో మగవాళ్ళు వసుంధర చెప్పినంత, నేను ఊహించినంత అల్పులు కారేమోనని మొట్టమొదటిసారిగా అనిపించింది.

నేను కాలేజీలో జాయినయ్యాను. నా కలలు ఫలిస్తున్నాయి. కొత్త జీవితం, కొత్త వాతావరణం, కొత్త స్నేహితులు. వారి మధ్య నాకు ప్రత్యేకమయిన స్థానం. ఇంట్లో కూడా నా కెలాంటి ఇబ్బందీ లేదు. రాజారావుగారికున్న డబ్బు మాకు కావల్సిన సౌకర్యాలు ఏర్పరచింది. మంజుకి నా దగ్గరకంటే తండ్రిదగ్గరే చనువు యెక్కువ. వారు నన్ను కూడా మంజుతోపాటు మరో పసిపిల్లలా చూసి గారాబం చేసేవారు. అప్పుడప్పుడు కాలేజీనుంచి రాగానే యెదురొచ్చి నా కాళ్ళకి చుట్టేసుకునే మంజుని యెతుకుని గుండెలకి హత్తుకున్నప్పుడు మాత్రం నేను విచిత్రంగా అనుభూతి చెందేదాన్ని. స్త్రీకి మాతృత్వంలోవున్న మాధుర్యం వేయిమంది డాక్టర్లయినా, లక్షమంది లాయర్లయినా దొరకదు అనిపించేది. డాక్టర్లీ చదువులో ప్రవేశించిన తర్వాత సంతానం కలుగకుండా జాగ్రత్త పడటానికి వుపాయాలు నేర్చుకున్నాను.

వారి ప్రోత్సాహంమీదనే "మంజూ నర్సింగ్ హోమ్" తెరిచాను. డాక్టరుగా నా అభివృద్ధికి ఆయన చేయవలసినదంతా నా వెనక నిలబడిచేశారు. కొద్ది సంవత్సరాలలోనే నా నర్సింగ్ హోమ్ మంచిపేరు ప్రతిష్ఠలు తెచ్చుకుంది. డాక్టరు సుశీలాదేవి పేరు వినగానే రోగుల కళ్ళలో ఆశ తళుక్కమనడం ప్రారంభించింది. ఇదంతా జరిగి, తీరా ఫలితం అందుకోబోయే సమయానికి వారి జీవితకాలం అయిపోయింది. మృత్యువు మమ్మల్ని విడదీసింది. ఆయన నా చేతుల్లో నిశ్చింతగా తృప్తిగా కన్ను మూశారు. ఆయన లేనిలోటు నాకెలాగో అన్పించసాగింది. దాన్ని మర్చిపోవటానికి ఎక్కువగా పనిచేయటం ప్రారంభించాను. అయినా నా మనసులో ఏదో దిగులు, ఏదో అర్థంగాని బాధ, ఏం సాధించానూ అనే అసంతృప్తి. నాకేం మిగిలిందీ అనే ఆవేదన, నేనేం పొందానూ అనే అశాంతి మూకుమ్మడిగా వచ్చి నన్ను వేధించడం ప్రారంభించాయి. క్రమేపీ నా ఆరోగ్యం దెబ్బతినడం ప్రారంభించి యిక తప్పనిసరిగా కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది.

"అమ్మ నిద్రపోయిందా?" హాల్లో మంజు కంఠం వినిపించడం తోనే వులిక్కిపడ్డాను. చాలా సేపటినుంచి ఇలాగే కూర్చున్నానన్న ధ్యాసే లేదు. టైమెంత గడిచిందో స్పృహే లేదు.

మంజు నా గదివైపు వస్తున్న అడుగులశబ్దం విని చేతిలో పూలని చప్పున దిండుక్రింద దాచేశాను.

"అమ్మా!" మంజు లోపలికివచ్చి పిలుస్తూ లైటు వేసింది. హఠాత్తుగా వచ్చిన వెలుగు భరించలేక కళ్ళు మూసుకున్నాను.

"అదేమిటి? అలా కూర్చున్నావేం? మళ్ళీ టెంపరేచర్ వచ్చిందా?" చేతిలో బాగ్ టేబుల్‌మీద పారేసి అదుర్దాగా నా దగ్గరికి వచ్చింది.

"ఊహుఁ! టైమెంతయింది?"

"పది." మంచంమీద కూర్చుంటూ అంది.

నేను ఉలిక్కిపడ్డాను.

"నువ్వు నిద్రపోతున్నావేమోనని లేపలేదని వంటమనిషి చెప్పింది." దుప్పటి అంచు సరిచేస్తూ అంది. నా దృష్టి వంచుకున్న మంజు తల మీద నిలిచింది. వెళ్ళేటప్పుడు తల్లో పూలులేవు. ఇప్పుడు సన్నజాజులు, గులాబులు కలిపి పెట్టిన పెద్దమాల వుంది. ఎవరెవరు వెళ్ళారు సినిమాకి?"

"నేనూ, సరోజా."

"సరోజా, నువ్వూనా?"

"అవును. ఏం?"

నేను నిర్ఘాంతపోయాను.

"మంజూ!" కటువుగా పిలిచాను.

"ఊఁ" దుప్పటి అంచు ఇంకా సరిచేస్తూ పరధ్యాసగా పలికింది.

"అబద్ధాలు ఎవరు ఆడ్తారో తెలుసా?"

చురుగ్గా తలెత్తి నావైపు చూసింది మంజు.

"చేసినపని తప్పు అని ధైర్యంగా బయట పెట్టలేనివాళ్ళు, నిజాన్ని నిర్భయంగా చెప్పలేని పిరికివాళ్ళు."

"అమ్మా!"

ఆ పిలుపుతో మెత్తపడ్డాను. "నిజం చెప్పు, ఎవరితో వెళ్ళావు? సరోజ నిన్న సాయంత్రం వూరు వెళ్ళిందని నీకు తెలియదేమో కానీ నాకు తెలుసు."

మంజు ముఖం ఎర్రబడింది. తప్పుచేసినదానిలా తలవంచుకుంది.

"చెప్పు, నా దగ్గర అబద్ధం ఆడే ధైర్యం నీకుందని నాకింతవరకు తెలియదు."

"చెప్తే నీకు కోపం వస్తుంది."

"రాదు." ఖచ్చితంగా అన్నాను.

"అమ్మా! రేపు నేను నీకు ఒకతనిని పరిచయం చేస్తాను."

"ఎవరతను?" ఊపిరి బిగబట్టి అడిగాను.

మంజు మాట్లాడలేదు.

"చెప్పు, ఎవరతను? నీకు ఎన్నాళ్ళనుండి పరిచయం?"

"పరిచయం కొద్దిగానే అనుకో! మా వసంతా వాళ్ళ అన్నయ్యకి ఫ్రెండ్."

"ఏం చేస్తాడతను?"

"ఏదో బిజినెస్ చేస్తాడు. చాలా డబ్బుంది."

నాకు నోట్లోంచి మాటరాలేదు. ఇంతక్రితమే మంజు భవిష్యత్ గురించి నేను బంగారు కలలు కంటూ ఏవేవో వూహిస్తున్నాను. మంజు అమాయకురాలు. ఆ అమాయకత్వం వల్ల దాని కెలాంటి అపదా రాకూడదు.

"అతనితోనా నువ్వివ్వాళ సినిమాకి వెళ్ళింది?"

మంజు వంచుకున్న తలని 'ఔను' అన్నట్టు వూగించింది.

"సరే! రేపే అతన్ని తీసుకురా! నేను చూస్తాను."

"అలాగే తప్పకుండా, అసలు నేనే చెప్పాలనుకుంటున్నాను." కోటి కాంతులు మెరుస్తున్న కళ్ళతో నావైపు చూస్తూ అంది.

"మంజూ! నువ్వు — నువ్వతనితో హద్దుమీరి ఏమీ ప్రవర్తించలేదు కదా!" అడగలేక అడిగాను. కారణం మంజు ముఖంలో బుగ్గమీద ఎర్రగా కందినగాటు - మునిపళ్ళతో కొరికిన గుర్తు-అని నాలో తల్లి గుర్తించడమే కాకుండా డాక్టరుకూడా ధృవపరిచింది.

మంజు చెక్కిళ్ళు కుంకుమ అద్దినంత య్రెరగా కందిపోయినాయి. వెంటనే లేచి నిలబడుతూ "పోమ్మా! నేను-నేను మరీఅంత పసిపిల్లనుకాను. నీ అనుమతిలేందే-" అని మధ్యలో ఆగిపోయి "రేపు నువ్వు అతన్ని చూడమ్మా!" అని వెళ్ళిపోయింది.

"నీకు తెలియదూ మంజూ! ఈ ప్రపంచంలో ఆడవాళ్ళకి చాలా బాధలున్నాయి. మోసాలు అనేక రూపాల్లో కన్పించకుండా కాటెయ్యాలని చూస్తాయి" అనుకున్నాను నీరసంగా. మంజు పెళ్ళి విష యంలో కన్న కలలు కల్లలై నన్ను వెక్కిరించకూడదు. ఆ రాత్రి నాకు కలతనిద్ర పట్టింది.

మర్నాడు సాయంత్రం—నేను అలాగే ఓపిక తెచ్చుకుని బట్టలు వేసుకుని మంజు చెప్పిన అతని రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను.

"అమ్మా, నువ్వు అతనితో కాస్త జాగ్రత్తగా మాట్లాడాలి" అంది మంజు.

"మాట్లాడటం ఈరోజు నీదగ్గర కొత్తగా నేర్చుకోవాలంటే?"

"అదికాదమ్మా! మీ డాక్టర్లతో వచ్చిన చిక్కేమంటే-ప్రతి మనిషినీ ఓ రోగిలా శోధించాలని చూస్తారు!" బుంగమూతి పెడ్తూ అంది.

"హతోస్మి!"

"కాదమ్మా! అతని స్వభావం చాలా సున్నితం. మా అమ్మ ఎంత మంచిదని! ఎంతబాగా మాట్లాడుతుందని!" మంజు వంగి నా నుదిటిమీద చప్పున ముద్దుపెట్టుకుంది. అది రాబోయే అతనితో జాగ్రత్తగా మాట్లాడా లని కోరుతూ యిస్తున్న లంచం అని నాకు తెలుసు.

"మంజూ! అతను రాగానే కాఫీచూసే నెపంతో నువ్విక్కడనుంచి వెళ్ళిపోవాలి. నేనతనితో ఒంటరిగా మాట్లాడాలి" అంటూ ముందే ఆదేశిం చాను. మంజు నా వంక అనుమానంగా చూసినా ఏమనుకుందో ఏమో; సరే నంటూ ఒప్పుకుంది.

ఇంతలో వాకిట్లో కారు హారన్ విన్పించింది. "అదుగో! వచ్చి నట్టున్నారు!" అంటూ మంజు మెరుపులా బయటికి పరుగెత్తింది. మంజులో యింత హుషారుని రేకెత్తిస్తున్న అతనిని చూడాలని నేను కూడా ఆత్రుత పడుతున్నాను.

"రండి!" మంజు ఆహ్వానంతోపాటు "ఆలస్యం చేశానా?" అని నిండుగా, గంభీరంగా పలుకుతున్న మగకంఠం విన్పించింది. ఆ కంఠం లాటిది నేనెక్కడో విన్నాను. ఆ పరిచయం ఎవరిదా- అని నేను గుర్తుకు తెచ్చుకునే అవకాశం లేకుండానే మంజు లోపలకి వచ్చింది. నేను లేచి నిలబడ్డాను.

మంజు వెనక పొడుక్కి తగిన లావుతో, తెల్లటి బట్టలతో ఒకతను లోపలికి వచ్చాడు.

"అమ్మా! ఇతనే భాస్కర్. భాస్కర్! మా అమ్మ." మంజు పరిచయం చేసింది. నవ్వబోతున్న నా పెదవులు ఆగిపోయాయి. నమస్కారం చేయటానికి జోడించిన చేతులు బిగుసుకున్నాయి.

"నమస్కారం!" అతను నన్ను గుర్తుపట్టలేదేమో, చిరునవ్వుతో నమస్కరించాడు. మంజు ఎటువైపూ చూడకుండా "నేనిప్పుడే వస్తాను" అంటూ లోపలికి పరుగెత్తింది. నా కళ్ళముందు ప్రపంచం యింకా గిర్రున తిరుగుతూనే వుంది.

"భాస్కరం!" అయోమయంగా, స్పష్టంగా అన్నాను.

"ఇన్ని రోజుల తర్వాత మళ్ళీ యిలా కలుసుకోవటం ఎంత విచిత్రం!" చిరునవ్వు చెదరకుండా అన్నాడు.

"అంటే....అంటే" నా పెదవులు తడారిపోయాయి. మాటలు తడబడ్డాయి.

"కొద్దిరోజుల క్రితమే మంజు ఎవరో నాకు తెలిసింది. తెలిసిన తర్వాత మరీ అపురూపమయింది."

"కాని యిది....యిదెలా సాధ్యం?" కాళ్ళు వణకడంతో నిగ్రహించుకోలేక కుర్చీలో కూలబడ్డాను.

"ఏం, ఎందుకు సాధ్యంకాదు?" తను కూడా కూర్చుంటూ అడిగాడు. నన్ను చూసిన తర్వాత, నేను ఫలానా అని తెలిసిన తర్వాత కూడా అతనంత నిశ్చలంగా మాట్లాడగలగడం చూసి నిజంగా నాకు మతిపోసాగింది.

"నువ్వు, నువ్వు మంజు ఎవరో తెలిసేలా ప్రోత్సహించావా?"

మొదట అతను నావైపు కుతూహలంగా చూశాడు. తర్వాత క్షణం

సేపు ఆగి "దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకులేదు. అయినా మనిషి యెవరో తెలుసుకోకుండా మనసు యిచ్చే మూర్ఖుడిని మాత్రం కాదు" అన్నాడు.

నాకు కోపం వచ్చింది. "మనసు! హుఁ? ఎన్ని మనసులున్నాయి నీకు? ఎంతమందికిసావు? ఒకరోజు ఈ విషయంలోనే నన్ను అర్థించా వన్న సంగతి మర్చిపోయావా?"

అతను దెబ్బతిన్నట్టు చూశాడు. కానీ అంతలోనే నిగ్రహించు కుంటూ "నిజమే! గతాన్ని గుర్తుచేసుకోటానికి సిగ్గుపడను. అందులో ముఖ్యంగా నా దగ్గర ఆ రోజు నువ్వు నిర్లక్ష్యంగా తన్ని వెళ్ళిపోయి నప్పుడు, తగిలిన నా హృదయ కలశాన్ని పట్టుకుని దేశాంతరం పారి పోయాను. మనిషి జీవితానికి ఆయువుపట్టు అయినదాన్ని మళ్ళీ అతుకు పెట్టుకోడానికి రాత్రింబవళ్ళు కృషి చేశాను. ఆ ప్రయత్నంలో ఎన్ని సంవత్సరాలు గడిచిపోయినాయో, నా జీవితం ఎంత వ్యర్థమయినదో నా కిప్పుడు గుర్తురావటంలేదు." క్రిందికి చూస్తూ అంటున్న ఆ మాటలు, ఆ పలికే తీరు నా మనసు కదిపి వేసినట్టుంది.

"ఎంతో ప్రయత్నంమీద మనసుని కూడదీసుకున్నాను. నిజమే. కానీ మళ్ళీ వెగటు లేకుండా యే ఆడదాని ముఖం జూడలేకపోయాను. నా జీవితం యిక యిలా స్త్రీ శూన్యంగా గడచిపోతుందనే నమ్మాను. నీ మూలంగా నేను బ్రతుకంటే కోల్పోయిన ఆసక్తినీ, తీపినీ మళ్ళీ మంజు నాలో రేకెత్తించటం నిజంగానే చిత్రం!"

అతను లేచి కిటికీ దగ్గరగా వెళ్ళిపోయాడు. నాకేం మాట్లాడాలో తోచలేదు. నావైపు వీపుపెట్టి నిలబడి బైటికి చూస్తున్న అతన్ని పరీక్షగా చూశాను. మంజు అతని వయసు విషయంలో పొరబడటంలో యే మాత్రం ఆశ్చర్యంలేదు. ఎంత వయసు వచ్చినా వార్ధక్యం పొడజూపని మనుష్యుల కోవకి చెందినవాడు అతను. నేను చూసినప్పుడు సన్నగా, పొడుగ్గా చువ్వలా వుండేవాడు. ఇప్పుడు కొద్దిగా ఒళ్ళు వచ్చి పొడుక్కి తగిన లావుతో నిండుగా హుందాగా వున్నాడు. ఇదివరకు బట్టలు ధరించే విషయంలో లేమివల్ల కలిగిన నిర్లక్ష్యం వుండేది. ఇప్పుడా లోటు కూడా లేదు. అతన్ని అలా వెనకనుంచి చూస్తుంటే గంభీరంగా, స్థిర

మయిన వ్యక్తిత్వం పరిపూర్ణంగా కలిగిన మనిషిలా కన్పిస్తున్నాడు. నాకు తెలిసిన భాస్కరానికి, ఈ భాస్కరానికి చాలా తేడా కన్పిస్తోంది.

"భాస్కరం!"

"నువ్వింకా అలా పిలవగలగటం నా అదృష్టమా, దురదృష్టమా అన్పిస్తోంది." బయటికి చూస్తూ అన్నాడు.

"భాస్కరం! ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు."

"ఏం? ఎందుకని?"

"భాస్కరం! నువ్వు....నువ్వు మంజుకి తండ్రిలాటివాడివి."

"తండ్రిలాటి వాడిని కాని, తండ్రిని కాదు. పోనీ, నీ మాటే ఒప్పకుంటాను. ఒక్క తండ్రే కాదు, స్నేహితుడు, ఆప్తుడు, అన్నీ నాలో చూపించగల భర్తని అవుతాను."

నాకేం చెప్పాలో తోచలేదు.

"కానీ, మీ యిద్దరిమధ్యా వయసు తేడా...." నేను వాక్యం పూర్తి చేయక మునుపే అతను చివ్వున వెనక్కు తిరిగాడు. అతని కళ్ళు కొంటెగా చూశాయి. పెదవులు నిర్లక్ష్యంగా నవ్వాయి.

"నీకూ, రాజారావుగారికీ మధ్యనున్న వయసు తేడాకంటే ఎక్కువేం కాదు."

"నా సంగతి వేరు." అసహనంగా బిగ్గరగానే అన్నాను.

"మంజూ నీ కూతురు!"

నేను లేచి నిలబడ్డాను. ఈ మధ్యలో లోపలినుంచి మంజు ఎక్కడ వస్తుందో అని, అదో భయం. గబగబా గుమ్మం దగ్గరికి వెళ్ళి తొంగి చూశాను. వంట యింటిలో నుంచి మంజు కంఠం విన్పిస్తోంది. ఆ చుట్టు ప్రక్కలలేదని ధైర్యం కలిగిన తర్వాత భాస్కరం దగ్గరికి తిరిగివస్తూ "నీకు పుణ్యం వుంటుంది. నన్ను అర్థం చేసుకో!" అన్నాను ప్రతిమాలే ధోరణిలో.

"ఒకరోజు నేను నిన్ను అర్థంచేసుకోమని అర్థించాను. నువ్వు వినలేదు. ఈనాడు నీ ప్రార్థన నేను వినను. వినదలుచుకోలేదు. నీకు ముందే చెబుతున్నా. నువ్వెంత ప్రయత్నించినా, యెంత అడ్డుపడాలని చూసినా

మంజు నా భార్య అయితీరుతుంది. అది మర్చిపోకు." దృఢంగా నిశ్చలంగా అన్నాడు.

"అంటే?.... అంటే నా మీద ప్రతీకారమా?" నీరసంగా అడిగాను.

సిగరెట్ వెలిగించుకోబోతున్న అతను ఆగిపోయాడు. అగ్గిపుల్ల ప్రక్కన పారేసి వెళ్ళి సోఫాలో కూర్చుంటూ "లేదు సుశీ! లేదు. అంత నీచుడిని మాత్రంకాదు. ఒకప్పుడు నువ్వంటే నాకెంత ప్రాణమో నీకు తెలుసు. దురదృష్టవశాత్తు నా రాత బాగుండక నిన్ను పోగొట్టుకున్నాను. ఇప్పుడు ముమ్మూర్తులా నీలావున్న మంజుని పొంది అయినా నన్ను సేద దీరనీ! మా ఋద్దరిమధ్య వయసు తేడా గురించి నేను ఆలోచించక పోలేదు. కానీ నా శరీరంలో దారుఢ్యం తగ్గలేదు. నా మనసులో మరో స్త్రీకి స్థానం లేదు. తొలి ప్రేమలోని మాధుర్యం మంజుతోపాటు నా మనసు కూడా సమానంగా అనుభూతి చెందుతుంది. భగవంతుడి సాక్షిగా మంజుకి ఏ లోటూ రాదు. నన్ను నమ్ము!" గదిలో భయంకరమైన నిశ్శబ్దం ఏర్పడింది.

"కాని భాస్కరం, నిన్ను.... నిన్ను అల్లుడిగా భరించటం నాకు...."

ఇంతలో మంజు అడుగుల శబ్దం విన్పించటంతో ఆగిపోయి కుర్చీలో కూలబడ్డాను.

భాస్కరం చప్పున కిటికీవైపు తిరిగి నిలబడ్డాడు.

గదిలో అడుగుపెట్టిన మంజు నావైపు ఆత్రంగా చూసింది. నేనుగాని, మంజుగాని యేమీ మాట్లాడటానికి అవకాశం యివ్వకుండానే భాస్కరం కిటికీ వైపునుంచి వెనక్కి తిరిగి మంజు దగ్గరగా వెడుతూ "మంజూ! మీ అమ్మని గురించి చెప్పేటప్పుడు నీ కళ్ళలో పొంగే గర్వం నా కర్థమైంది. రేపటినుంచి నా కాబోయే అత్తగారు గురించి సరిగ్గా నేను కూడా అలాగే ఫీలవుతాను. మీ అమ్మగారిలాంటి వ్యక్తి అత్తగారుగా పొందడం కేవలం నా అదృష్టం" అన్నాడు.

మంజు మెరిసే కళ్ళతో ఆనందంతో తృప్తిగా నావైపు చూసింది.

నా గుండెలు యెవరో యినుప పిడికిలితో నలుపుతున్నట్టు విలవిల లాడినాయి.

ఆ సంభాషణ ఎక్కువ జరగలేదు.

ఎలాగో కూర్చుండిపోయిన నన్ను చూసి మంజు "అమ్మ ఒంట్లో బాగుండటం లేదు" అంది. "అవునవును. మనం ఎక్కువ శ్రమ ఇవ్వటం మంచిదికాదు" అంటూ భాస్కరం మర్యాదగా చేతులు జోడించి శలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

వెంట మంజుకూడా వెళ్ళింది.

సంధ్య చీకట్లు ఆవరించుకుంటున్న ఆ సమయంలో విశాలమయిన ఆ హాల్లో నిశ్శబ్దంగావున్న పరిసరాల్లో నేను వంటరిగా మిగిలిపోయాను. భయంకరంగా వున్న వంటరితనం రాక్షసిలా నోరు తెరచి నన్ను మింగాలని చూడసాగింది.

మంజు రాత్రి పొద్దుపోయిం తర్వాత యింటికి తిరిగివచ్చింది. వస్తూనే నా గదిలోకి వచ్చి "అమ్మా!" అని పిలుస్తూ లైటు వేసింది. విశాలమైన ప్రక్కమీద ప్రాణం లేనట్టు పడివున్న నేను మంజువైపు భయం భయంగా చూశాను. దానిముఖం మామూలుగానే వుంది. కళాకాంతులీను తున్నాయి. బుగ్గల్లో గులాబీలు వెల్లివిరుస్తున్నాయి. కలలమధ్య జీవిస్తూ మేఘాల్లో తేలిపోతున్నట్టు హుషారుగా వుంది. అంటే భాస్కరం ఏం చెప్పలేదన్నమాట! చెప్పటమూ, చెప్పకపోవటమూ అన్న నిర్ణయాన్ని నాకే వదిలేశాడు. ఎంత విషమ పరీక్ష!

"అమ్మా!" మంజు వచ్చి నా పక్కలో కూచుంది. నాకు తెలుసు. ఆ పిలుపులో భాస్కరం గురించి నా అభిప్రాయం ఏమిటి అనే భావం దాగివుంది.

"మంజూ! ఇప్పుడే నేనేం చెప్పలేను-నాకు టైం కావాలి."

"అలాగేనమ్మా! నీకు చాలా అలసటగా వున్నట్టుంది. పడుకో." రగ్గుసరిగా కప్పుతూ అంది.

"మంజూ!"

"ఏమిటమ్మా?"

"ఒకవేళ....ఒకవేళ నేను అతన్ని ఇష్టపడకపోతే?"

"అమ్మా" మంజు కళ్ళలో కన్పించిన భావం చూసి నా మనస్సు గిలగిల్లాడింది.

"చెప్పు, ఏం చేస్తావు? నన్ను కాదని, అతన్ని చేసుకుంటావా?" చెయ్యి పట్టుకుంటూ అడిగాను.

"ఊహు! చేసుకోను." తల అడ్డంగా తిప్పుతూ దృఢంగా అంది.

నాకు ఒక్కసారి ఆనందం ఉప్పొంగింది. మరుక్షణంలో అంతు లేని నీరసం కూడా వచ్చింది. మంజు అలా 'చేసుకోను' అని ఖచ్చితంగా ఒప్పుకొనేకంటే 'చేసుకుంటాను' అని మొండిగా జవాబు ఇస్తే నాకింకా తేలిక అన్పించేదేమో!

"నువ్వు పడుకోమ్మా! నిదానంగా మాట్లాడుకోవచ్చు" అంది.

గదిలోంచి వెళ్ళబోయే ముందు తటపటాయిస్తున్నట్టు గుమ్మంలో ఒక్కక్షణం ఆగి వెనక్కితిరిగి "అమ్మా! నువ్వు వద్దన్నపని నేనెప్పుడూ చేయను. కానీ ఒకవేళ....ఒకవేళ ఏ కారణం చేతనైనా అతను నీకు నచ్చకపోతే ఇంకెప్పుడూ నా పెళ్ళి ప్రసంగం ఎత్తదు. అతను తప్ప మరోమనిషి నీడనికూడ నేను భరించలేను" అనేసి వెళ్ళిపోయింది.

నాకు తెలియని అసహనం, నేను భరించలేని అశాంతి నాలో చేరి నన్ను పిచ్చిదాన్ని చేయసాగింది. ఆ రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. వీల్లేదు. భాస్కరం మంజూని పెళ్ళిచేసుకోవటానికి వీలులేదు. నా కంఠంలో ప్రాణం ఉండగా నేను ఒప్పుకోను. మంజు సహృదయుడైన భర్త ప్రక్కన, పిల్లా జెల్లాతో కళకళలాడుతూ కాపురం చేస్తుంటే వాళ్ళ మధ్య జీవిస్తూ నా వంటరితనాన్ని మరచిపోవాలని ఇంత తీవ్రంగా వాంఛిస్తున్న నేను, భాస్కరం మంజు భార్యాభర్తలయితే వాళ్ళమధ్య ఎలాంటి భారం లేకుండా నేను ఒక్కక్షణమైనా వుండగలనా? వుండలేను. భగవాన్! అది అతనికి ఎలా తెలుస్తుంది? ఏవిధంగా తెలియచెప్పడం నేను? ఆ రాత్రంతా నాకిదే ఆవేదనతో తెల్లారిపోయింది.

రోజులు గడుస్తున్నాయి. మంజు, భాస్కరం కలిసి తిరుగుతూనే వున్నారు. నేను కాదనలేకపోతున్నాను. మంజుకి చీరెలు తేవడంలో, దానికి పూలు కొనడంలో, దాన్ని అన్నివిధాలా అపురూపంగా చూడ డంలో ఆడంబరం కన్పింపచేస్తున్న భాస్కరం నేను పోగొట్టుకున్నది

ఏమిటో గుర్తించేలా పాఠం నేర్పుతున్నాడని అనిపించసాగింది. ఎన్ని సార్లు అతనితో వంటరిగా కలవాలన్నా వీలుచిక్కలేదు. నా మనసులో అభిప్రాయం గుర్తించిన మనిషిలా అతను తెలివిగా ఆ అవకాశాన్ని తప్పించేస్తున్నాడు. ఎంత ప్రయత్నించినా నేను మంజుకి భాస్కరం ఎవరో చెప్పలేకపోయాను. అతను నామాట వినడు. మంజుని భార్యగా చేసుకుని తీరుతాడు. అంతకంటే ఓటమి నా జీవితంలో యింకేమీలేదు. బ్రతికుండి అతనిముందు ఓటమి ఒప్పుకునేకంటే మరణించి అతనిమీద విజయం సాధించటం నాకు ఉత్తమంగా తోచింది. ఈ కొద్ది రోజుల్లోనే నేను వార్ధక్యం వచ్చేసిన దానిలా వడిలిపోయాను నాలో ఉత్సాహం ఎవరో వూదేసినట్టు ఆరిపోయింది. తెల్లవారటంలో, ప్రొద్దుగుంకటంలో, రోజు గడిచిపోవటంలో గల అర్థం నామనసు గ్రహించటం మానేసింది.

ఎంత ఆలోచించినా నా కళ్ళయెదుట రెండేరెండు మార్గాలు కన్పిస్తున్నాయి. భాస్కరం యెవరో తెలియజేసి, అతన్ని నువ్వు వివాహం చేసుకోవటానికి వీలులేదని చెప్పి మంజు మనసు ముక్కలు చేయటమా, లేక జరిగిందంతా నాలో దాచేసుకుని నిశ్శబ్దంగా నే నీ జీవితాన్నుంచి నిష్క్రమించటమా? రెండో మార్గమే నాకు అన్నివిధాల ఉత్తమంగా కన్పించసాగింది

భాస్కరం పేరిట మొదటినుంచి చివరివరకూ సుదీర్ఘంగా ఉత్తరం వ్రాశాను. అందులో అతన్ని అల్లుడిగా నేనెందుకు భరించలేనో నా వైపునుంచి కారణాలు చూపిస్తూ చివర యిలా వ్రాశాను: "భాస్కరం! ఆనాడు నిన్ను కాదన్న తర్వాత నీ గురించే ఆలోచించేదాన్ని. నిన్ను పొందకుండా నేను పోగొట్టుకున్నది ఏమిటో నాకు జీవితం బాగానేపాఠం నేర్పింది. స్వయంకృత అపరాధాన్ని మౌనంగా భరించడం వివేకవంతుల లక్షణం. నేను కూడా ఆ పనే చేశాను. మంజుని నువ్వంత ఆరాధిస్తుంటే అంతకంటే కావాల్సింది నాకింకేమీ ఈ జీవితంలో లేదు. కొద్ది సంవత్సరాలు బ్రతికి చేయవలసింది కూడా నాకేమీ కన్పించడం లేదు. నేను జీవించివుంటే మంజుకి దూరంగా వుండలేనన్న నా బలహీనత నీకు అర్థమౌతుంది అనుకుంటా. దగ్గరగా వుండాలంటే మీ యిరువురి మధ్యా అపశ్రుతిని అవుతానేమోనని నాకు నేనే భయపడుతున్నాను. అందుకే ఈ

జీవితం ముగించటానికే నిశ్చయించుకున్నాను. ఇది ఎవరి కోసమో చేస్తున్న త్యాగంకాదు. నా మనశ్శాంతి కోసం నేను ఎన్నుకొంటున్న మార్గం. భాస్కరం! మంజు అమాయకురాలు. కొన్ని సంవత్సరాల్కిత్రం నువ్వు నాలో చూశాను అనుకున్నంత సాజూకయిన హృదయం కలది. దానికెప్పుడూ ఎలాటి పరిస్థితుల్లోనూ ఈ విషయం తెలియకూడదు. దాని తండ్రి మరణమే నా యీ ఆత్మహత్యకి కారణం అని అపోహకలిగేలా నేనుజాగ్రత్తపడతాను. మీరిద్దరూ భార్యభర్తలుగా ప్రక్కప్రక్కననిలబడి జీవితంలో అన్నివిధాలా సుఖశాంతులు పొందాలని మనసారా ఆశీర్వదిస్తున్నాను.

భాస్కరం! మరో విషయం కూడా విను. ఆనాడు నువ్వు వెళ్ళిపోయేటప్పుడు పారెయ్యమని నాకిచ్చిన పువ్వులు నా దగ్గర యింకా వున్నాయి. వాటిని నువ్వు కోరినవిధంగా పారెయ్యగలిగిన శక్తి నాకు లేకపోయింది. అవి ఇంతకాలం భద్రంగా దాచివుంచానంటే ఎందుకో నువ్వు వూహించగలవు. వాటిని ఈ ఉత్తరంతో పంపిస్తున్నాను. అప్పుడు నువ్వు వాటిని పారవేయలేకపోయినా ఇప్పుడు చేయగలవు. ఆ శక్తి నీకున్నప్పుడే మంజుని నిండు మనసుతో స్వీకరించగలుగుతావు. మృత్యుముఖంలోకి అడుగు పెట్టబోయేముందు నేను నిన్ను కోరేది యిది ఒక్కటే.

ఉంటాను,
సుశీల."

ఎన్నో గంటలు కూర్చుని యెంతో శ్రమపడి వ్రాసిన ఆ ఉత్తరం మధ్యాహ్నం నౌకరు చేతికిచ్చి భాస్కరం ఉండేచోటుకి పంపాను.

ఇది నా జీవితంలో ఆఖరి రోజు. రేపు నేనుండను. నేను లేని ఈ ప్రపంచం ఎలా ఉంటుందో చూడాలని కుతూహలంగా ఉంది. స్లీపింగ్ పిల్స్‌వున్న సీసా చేతిలోకి తీసుకొని చూశాను. తెల్లటిమాత్రల మధ్య నల్లటి మృత్యువు ఆప్యాయంగా నవ్వుతూ ఆహ్వానిస్తోంది. మరి కొద్ది సేపటిలో భయంకరమైన మృత్యువు నన్ను ఒడిలోకి తీసుకుంటుంది. మృత్యువు భయంకరమా? కాదు కాదు, ఎప్పటికీ కానేకాదు. జీవితంలో భరించలేని సమస్యలమధ్య నలిగిపోతున్న మనిషికి మనశ్శాంతిని యిచ్చే

మహా ఔషధం! హాయిగా విశ్రాంతి ఇవ్వగల మెత్తటి పూలపాన్పు. పరధ్యాసగా ఇలా పిచ్చిపిచ్చిగా ఆలోచిస్తున్న నేను హాల్లోంచి టెలిఫోన్ విన్పించటంతో. వెళ్ళి తీసుకున్నాను.

నర్సింగ్ హోమ్‌నుంచి కాల్ వచ్చింది. అర్జెంట్ కేస్. ప్రసవించలేక బాధపడ్తోంచట. నేను ఉన్నపళంగా రావాలట. నే నెందుకో ఆ మాటని కాదనలేకపోయాను. పోనీ, మృత్యుముఖంలో అడుగుపెట్టబోయే ముందుకూడా మరోజీవం పోస్తాను. ఈ ప్రపంచలోకి రావాలని తహతహలాడుతున్న ఇంకో కొత్త ప్రాణానికి అవకాశం కల్పిస్తాను. ఆఖరు క్షణంలో కూడా డాక్టర్‌గా నా ధర్మం నేను నెరవేరుస్తాను.

హాస్పిటల్‌కి వెళ్ళాను. కేసు చాలా కాంప్లికేటెడ్‌గా ఉంది. నర్సింగ్ హోమ్‌లో రోగి తాలూకు తల్లి-తండ్రి-భర్త నా వైపు ఆత్రంగా దీనంగా చూశారు. పేషెంట్ పరిస్థితి నేను వూహించిన దానికంటే ప్రమాదంగా వుంది. నాకు తెలిసిన విజ్ఞానంతో, హాస్పిటల్లో ఉన్న కత్తులు-కటార్లతో దాదాపు మూడు నాలుగు గంటలు హోరాహోరీ యుద్ధం చేశాను. చివరికి నా శ్రమ ఫలించింది. విజయదేవత నన్నే వరించింది.

దాదాపు అర్ధరాత్రి అవుతుండగా కొద్దిగా అలసటతో ఇంటికి తిరిగి వచ్చాను. నారాకకోసం యెదురుచూస్తున్న వంటమనిషి అలవాటు ప్రకారం ఓ కప్పు హార్లిక్స్ తెచ్చి యిచ్చింది.

"మంజు పడుకుందా?" అన్నాను.

'అవును' అన్నట్టు తలూపింది.

ఆఖరిసారి మంజుని కళ్ళారా చూడాలనిపించి గదివైపు నడిచాను. కాని మధ్యలోనే ఆ ప్రయత్నం విరమించుకుని నా గదివైపు మళ్ళాను. మంజుమీద మమత మళ్ళీ నా నిశ్చయాన్ని సడలిస్తుందేమోనని భయంవేసింది.

నాగదిలోకి వెళ్ళి లైటువేశాను. వేస్తూనే ఉలిక్కిపడ్డాను. ఎన్నడూ లేంది ఈ రోజు మంజు నా మంచంమీద పడుకుని నిద్రపోతోంది. దగ్గరగా వెళ్ళి కొద్దిగా తట్టి "ఇక్కడ పడుకున్నావేమ్మా?" అన్నాను. ఓ ప్రక్కకి ఒత్తిగిలి అమాయకంగా పసిపిల్లలా నిద్రపోతున్న మంజు మంచి నిద్రలో వుండటంవల్ల మాట్లాడలేదు. లేపటం ఇష్టంలేకపోయింది. మంజుని అలా

రెప్పవాల్చకుండా చూస్తుంటే నా కళ్ళు చెమర్చినాయి. 'రేపు నేనుండను. ఆఖరిసారి యిలా అర్ధరాత్రి నీ దగ్గరికివచ్చి తనివితీరా నిన్ను చూసుకున్నానన్న సంగతి నీకెప్పటికీ తెలియదు.' లోపలనుంచి వస్తున్న నిట్టూర్పు అణుచుకుంటూ స్లీపింగ్ పిల్స్‌కోసం డ్రాయరువైపు వెళ్ళాను. తిరిగీ తిరగ్గానే నాగుండె ఆగినంత పనైంది. అక్కడ భాస్కరం పేరిట నేను పంపిన ఉత్తరం వాడిన పూలున్న ప్లాస్టిక్ పొట్లం ఉన్నాయి.

ఒక్క అంగలో వెళ్ళి ఉత్తరం తీసుకుని చూశాను. తెరిచేఉంది. ఆ ఉత్తరం ప్రక్కన ప్లాస్టిక్‌పొట్లం యెత్తుపెట్టి మరో కాగితం కన్పించింది: వణుకుతున్న చేతుల్తో అది తీసుకుని చూశాను. అందులో ఇలా ఉంది!

"అమ్మా!

భాస్కర్ అనుకోకుండా వూరువెళ్ళడంవల్ల రాము నీవుత్తరంతిప్పి తీసుకువచ్చాడు. అది తెరచిచూసేవరకూ నువ్వువ్రాసిందనినాకుతెలియదు. ఉత్తరం అంతా ఒకటికి నాలుగుసార్లు వివరంగా చదివాను. అమ్మా! నాకంతా అర్థమైంది. ఈ మధ్య భాస్కర్ తరుచుగా పరధ్యాసగా ఉండటానికి, అదో రకంగా మాట్లాడటానికి కారణం కూడా తెలిసింది. నాకేంచెయ్యాటానికీ పాలుపోవటంలేదు. నేను భాస్కర్‌ని చేసుకుంటే నువ్వు భరించలేవు. అతన్ని పొందకపోతే నేను బ్రతకలేను. అందుకే నువ్వు వెళ్ళాలనుకున్న మార్గాన్ని నేను ఎన్నుకున్నాను. నావల్ల ప్రపంచానికి ఏఉపయోగం లేదు. కానీ నువ్వు-నువ్వు వేరమ్మా! డాక్టరుగా నువ్వుకొన్ని కుటుంబాలకి చాలా అవసరం. నీమూలంగా కొంతమంది బ్రతుకుతారు. అందుకే నువ్వు జీవించితీరాలి అని మరీ మరీ ప్రార్థిస్తూ...." ఒక్కసారిగా కెవ్వుమన్న నేను "మంజూ" అంటూ వణుకుతూ వెళ్ళి మంచంమీద పడ్డాను. ఎంత పొరపాటు? క్షణం క్రితంచూసి నిద్రపోతుందని అనుకున్నాను "మంజూ! మంజూ!"వెర్రిగా అరుస్తూ లేవదీసి కుదిపాను. కాని అప్పటికే మంజు శరీరం నిర్జీవంగా, వాడిన కలువకాడలా నా చేతుల్లో వ్రేళ్ళాడిపోయింది. నా వైద్యశాస్త్రం ఎందుకూ పనికిరాదని, అప్పటికే సమయం మించిపోయిందనీ తెలిసిన నేను పిచ్చిదానిలా ఏడుస్తూ "భగవాన్ నేను-నేనేం చెయ్యాలి" అంటూ గదిలో దిక్కులు చూడటం ప్రారంభించాను. కొన్ని

గంటలక్రితం నేను ఓడించాననుకున్న మృత్యువు ఇప్పుడు మంజు మృత కళేబరం లోంచి నన్ను చూచి క్రూరంగా నవ్వసాగింది. ఆ నవ్వు వికటంగా ఇల్లు మారుమ్రోగిపోయేలా అంతకంతకీ ఎక్కువవుతోంది. వికృతంగా వున్న ఆ నవ్వు వేయి కంఠాలు, లక్ష కంఠాలు కాదు-కోటి కంఠాలుగా మారి ప్రతిధ్వనిస్తూ నిశ్శబ్దంగా వున్న ఆ పరిసరాల్లో నన్ను వెర్రిదాన్ని చేయసాగింది. మంజు తలని అలాగే చేతులమధ్య పట్టుకుని చేష్టలుడిగిన, దానిలా రెప్ప వాల్చకుండా ప్రాణంలేని బొమ్మలా కూర్చుండి పోయాను.